నాటి బీజం.. నేటి తేజం

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనులు
- మూడు గ్రామాల ప్రజలకు పునరావాసం
- రూ.400 కోట్లతో సౌకర్యాలు
- మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే, ఎంపీల ప్రత్యేక చొరవ
- నేడు ఇంటి పట్టాల పంపిణీ

గత ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ హయాంలో బీజం పడింది. నేడు ఫలమై ప్రజల చేతికి అందుతోంది. మంగంపేట గనుల ప్రభావిత గ్రామాలైన ప్రజలకు పునరావాసం కల్పించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.400 కోట్లు మంజూరు చేశారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పనులు వేగవంతంగా పూర్తి చేయించారు. తత్ఫలితంగా నేడు ప్రజల చేతికి పట్టాలు అందుతున్నాయి.


బాధితులకు పంపిణీ కోసం ఆర్‌ఆర్-5లో సిద్ధం చేసిన ప్లాట్‌లు

ఓబులవారిపల్లె : మంగంపేట గనుల నుంచి ప్రతి నిత్యం కాలుష్యం కారణంగా మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా ఇబ్బంది పడుతూ జబ్బులతో అనేక మంది మరణించారు. 2014–2019లోని తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గ్రామస్తులతో కలిసి గ్రామాల తరలింపునకు పోరాటాలు చేశారు. గ్రామస్తులను పెద్ద ఎత్తున పోలీసులు మోహరించి అణచివేసి అరెస్టు చేసి అడ్డుకున్నారు. అధికారంలోకి రాగానే మూడు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పిస్తామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ఇచ్చిన మాట నెరవేర్చిన జగన్

ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక మూడు గ్రామాల తరలింపు ప్రక్రియ చేపట్టారు. అప్పటి గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో మూడు గ్రామాల తరలింపు ప్రారంభించారు. ఇందుకు ముక్కావారిపల్లె రెవెన్యూ పరిధిలోని భూసేకరణ ద్వారా సర్వే నంబర్ 1098, 1099లో దాదాపు వంద ఎకరాలు సిద్ధం చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పునరావాసం కోసం దాదాపు నాలుగు వందల కోట్లు మంజూరు చేసింది. అధికారుల ద్వారా గ్రామ సభలు నిర్వహించి అందరి ఏకాభిప్రాయంతో మూడు గ్రామాలలో సర్వే చేపట్టి, దాదాపు 700 కుటుంబాలకు ప్యాకేజీ, పునరావాసం లబ్ధి చేకూర్చడం జరిగింది. గ్రామాల ప్రజలకు మెరుగైన పునరావాసం కోసం ఆర్‌ఆర్ 5లో దాదాపు 690 ప్లాట్‌లు ఏర్పాటు చేశారు.

మౌలిక సదుపాయాల కల్పన

మంగంపేట కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల ప్రజలకు మెరుగైన పునరావాసం కల్పించేందుకు ఆర్‌ఆర్ 5లో జాతీయ రహదారిని కలుపుతూ 60 అడుగుల విశాలమైన పక్కా రోడ్డు వేయించారు. అలాగే ప్లాట్‌ల మధ్య 40 అడుగుల వెడల్పుతో సీసీ రోడ్లు నిర్మించారు. ప్రతి వీధిలో విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు చేశారు. తాగునీటి కోసం బోర్లు వేయించి రెండు వాటర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. గుడి, బడి, కాలేజీ, స్టేడియం నిర్మాణం కోసం స్థలం కేటాయించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రతి నిత్యం గ్రామస్తుల అభిప్రాయం మేరకు అధికారులతో కలిసి పలు మార్లు పరిశీలించారు. మూడు గ్రామాల ప్రజలకు పునరావాసం కోసం మోడరన్ కాలనీ ఏర్పాటుకు ప్లాట్‌లు సిద్ధం చేశారు. మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పలు మార్లు జిల్లా అధికారులు, ఏపీఎండీసీ అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేయించారు. మూడు గ్రామాల ప్రజలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఇంటి పట్టాల పంపిణీ

మంగంపేట కాలుష్య గ్రామాల ప్రజలకు ఆర్‌ఆర్ 5లో శుక్రవారం ఇంటి పట్టాలను జిల్లాకు చెందిన మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని అధికారులు ప్రకటించారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యక్రమం నిర్వహిస్తారు.

ఇచ్చిన మాట నెరవేర్చారు



కాలుష్యంతో మూడు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడ్డాం. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పునరావాసం కల్పించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవ కారణంగా ప్లాట్‌లు ఏర్పాటు చేసి ప్యాకేజీలు ఇచ్చారు. నేడు ఇంటి పట్టాలు తీసుకొంటున్నాం. థ్యాంక్యూ జగన్ సార్.

– తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి, కాపుపల్లె, మంగంపేట, ఓబులవారిపల్లె

జగన్ కారణంగానే పునరావాసం



మజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కాపుపల్లె, దళితవాడ, అరుంధతివాడ గ్రామాల వారికి పునరావాసం కల్పించడం జరిగింది. చాలా ఏళ్లుగా గ్రామంలో కాలుష్యం కారణంగా వ్యాధులతో అనేక మంది మరణించారు. ఎంతో ఇబ్బంది పడ్డాం. అయినా మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామాల తరలింపు, ప్యాకేజీ కల్పించారు. తద్వారానే నేడు ప్లాట్‌లు ఇస్తున్నారు.

– హరిబాబు, ఎంపీటీసీ, మంగంపేట, ఓబులవారిపల్లె

పుట్టినరోజు మరింత గుర్తుండిపోయేలా..


విద్యార్థి మౌలాలి పుట్టిన రోజు సందర్భంగా మొక్కను నాటుతున్న దృశ్యం

రాజంపేట టౌన్ : మండలంలోని ఎన్‌టీఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్‌ఎం మల్లు నరసారెడ్డి ఓ మంచి ఆలోచన చేశారు. ఒకప్పుడు ఏమాత్రం సౌకర్యాలు లేని ఎన్‌టీఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు జగన్ ప్రభుత్వ హయాంలో నాడు–నేడు ద్వారా అన్ని సౌకర్యాలు సమకూరాయి. పాఠశాల రూపురేఖలే మారిపోయాయి. దీంతో పాఠశాలలో పచ్చదనం తీసుకొస్తే పాఠశాలకు మరింత హంగు రావడమేకాక పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులను భాగస్వామ్యులను చేయాలని నిర్ణయించారు. విద్యార్థుల పుట్టిన రోజు సందర్భంగా వారిచే మొక్కలు నాటించి ఆ మొక్కలను సంరక్షించే బాధ్యతను వారికే అప్పజెప్పారు. అంతేకాకుండా మొక్కల సంరక్షణ చేస్తున్న విద్యార్థులకు హెచ్‌ఎం తన సొంత డబ్బులతో బహుమతులు అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. గురువారం మౌలాలి అనే విద్యార్థి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థితో మొక్కను నాటించి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ సభ్యులు దుర్గా, కల్పన, ఉపాధ్యాయులు నాయుడోరి శ్రీనివాసులు, రాజేష్, రామచంద్రయ్య, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బుడుగుంటపల్లె ఇసుక రీచ్ పరిశీలన

రాజంపేట : రాజంపేట – రాయచోటి రహదారిలోని ఆర్.బుడుగుంటపల్లె రీచ్ నుంచి శుక్రవారం ఇసుక సరఫరా చేయనున్నట్టు సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవి తెలిపారు. గురువారం ఆమె ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక బుకింగ్ చేసుకున్న వారికి అందజేసేందుకు ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును సిద్ధం చేశామన్నారు. షిఫ్ట్ పద్ధతిలో ఇసుక సరఫరా అందజేస్తామన్నారు. ఇసుక రీచ్ నుంచి లభ్యమయ్యే ఇసుకను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మహబూబ్ చాంద్, ఏడీ మైన్స్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

చిట్వేలి : నాగవరంలో రూ.6లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణానికి రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌లు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, మణి, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం వాసికి డాక్టరేట్

రామాపురం : కెఎస్‌ఆర్‌సీఈ(ఏ) సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ గడికోట చెన్నకేశవరెడ్డి విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వడ్లమూడి, గుంటూరు నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. మండలంలోని బయారెడ్డిగారిపల్లెకు చెందిన చెన్నకేశవరెడ్డి సముద్రపు నీటికి బహిర్గతమైన జియో పాలిమర్ కాంక్రీట్ బలం, మన్నిక, సూక్ష్మనిర్మాణంలో అధ్యయనాలపై ఆయన చేసిన పరిశోధనలకు డాక్టరేట్ లభించింది.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం : ఖాళీగా ఉన్నా అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలని అసిస్టెంట్ సీడీపీఓ శోభారాణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ సిద్దవటం మండలంలోని భాకరాపేట సెక్టార్‌లో పేరయ్యగారిపల్లె మినీ అంగన్‌వాడీ వర్కర్(ఓసీ), మహబూబ్‌నగర్ (ఈడబ్ల్యూఎస్), భాకరాపేట (బీసీ–ఏ), ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులను కడపలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలియజేశారు.

వాగు పోరంబోకు ఆక్రమణ తొలగింపు

గాలివీడు : ఆక్రమణకు గురైన వాగు పోరంబోకు స్థలాన్ని ప్రభుత్వ స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎగువగొట్టివీడు గ్రామంలో సర్వే నెంబర్ 1003లో 2.86 ఎకరాల విస్తీర్ణం కలిగిన వాగు పోరంబోకులో జరిగిన ఆక్రమణను రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి తొలగించామన్నారు. సదరు ఆక్రణదారులకు నోటీసులు జారీ చేస్తూ తమవద్ద ఉన్న భూ హక్కు పత్రాలు, ఆధారాలను తీసుకురావాలన్నారు. అనంతరం ఆక్రమణ స్థలంలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ బాలజీ, మండల సర్వేయర్ తిమ్మారెడ్డి, వీఆర్‌ఓ నిర్మల్, విలేజ్ సర్వేయర్, వీఆర్‌ఏ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవ విగ్రహం ఊరేగింపు


ఊరేగింపుగా గణనాథుని తీసుకెళ్తున్న నిర్వాహకులు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు కొత్తపల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా ఉత్సవ విగ్రహాన్ని ఆలయానికి తరలించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి చాందినీ బండిలో స్వామివారి విగ్రహాన్ని ఉంచి పురవీధులలో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

5 ఎర్రచందనం దుంగలు ; కారు స్వాధీనం

సుండుపల్లె : మండల సరిహద్దులోని వీరబల్లి బీట్ క్వారీ పాయింట్ దగ్గర ఎర్రచందనం దుంగలను లోడ్ చేస్తుండగా ఐదు ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకున్నట్లు సానిపాయి రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. కారులో లోడు చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ రంజనీ, వీరబల్లి ఎఫ్‌బీఓ అనిల్‌కుమార్, లీలా శ్రీహరి, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్‌పై అనుచిత వ్యాఖ్యలు

సంబేపల్లె : గున్నికుంట్లలో భూ సర్వే సర్వేయర్ షాహిదాపై దుద్యాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆమె సంబేపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇరువురి మధ్య ఘర్షణ: ఒకరికి గాయాలు

రాయచోటి టౌన్ : వ్యాపార విషయంలో బుధవారం అర్ధరాత్రి ఇరువురి మధ్య ఘర్షణకు దారి తీసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. ఖదీరుల్లా,బేపారీ మన్సూర్ అలీఖాన్ ప్లాస్టిక్ గ్లాసుల వ్యాపారం చేసేవారు. వీరివురి మధ్య వ్యాపారం విషయంలో గతంలో ఇద్దరి మధ్య గొడవలు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి లక్ష్మీ వెంకటేశ్వర థియేటర్ వద్ద వీరిద్దరు గొడవపడ్డారు. ఖదీరుల్లా మన్సూర్‌పై కత్తితో దాడిచేయడంతో అతనికి తీవ్రగాయాలయ్యాయి.

భూ వివాదంతో హత్యాయత్నం

మదనపల్లె : భూవివాదం కారణంగా బంధువులే దంపతులపై హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెంచుపాడు పంచాయతీ పనసమానుకుంటకు చెందిన పుల్లానారాయణ(60)కు, అదే గ్రామానికి చెందిన పుల్లాశ్రీరాములు, చెన్నకేశవులతో భూవివాదం ఉంది. ఆ విషయంగా కోర్టులో కేసు నడుస్తోంది. గురువారం కోర్టు వాయిదాకు వెళ్లాల్సి ఉంది. అయితే ఈ క్రమంలో బుధవారం రాత్రి పుల్లా శ్రీరాములు, చెన్నకేశవ ఇద్దరూ కలిసి కొడవలి, చాకు, కర్రలు తీసుకుని నారాయణ ఇంటికి వెళ్లి నారాయణతోపాటు భార్య కమలమ్మపై దాడికి పాల్పడ్డారు. ఘటనలో నారాయణ తలకు తీవ్రగాయాలు కాగా, కుటుంబసభ్యులు 108 వాహనంలో బాధితుడ్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

నీటి తొట్టెలో పడి బాలిక మృతి

మదనపల్లె : ప్రమాదవశాత్తు నీటి తొట్టెలో పడి బాలిక మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ మొలకలదిన్నెకు చెందిన సోమశేఖర్, సునీత దంపతులు. వీరికి నవ్య శ్రీ(9)తోపాటు మరో అబ్బాయి సంతానం ఉన్నారు. ఆరు నెలల క్రితం సోమశేఖర్ మృతి చెందాడు. స్థానికంగా ఓ అద్దె ఇంట్లో సునీత పిల్లలతో కలిసి ఉంటూ కూలీ పనులకు వెళ్తూ జీస్తోంది. నవ్య శ్రీ మానసిక సమస్యలతో ఇబ్బంది పడుతూ స్వల్పంగా బుద్ధిమాంద్యంతో బాధపడుతుండేది. స్థానికంగా నాలుగో తరగతి చదువుతుండేది. గురువారం సునీత ఇంట్లో వంట చేసుకుంటుండగా, నవ్య శ్రీ నీటి తొట్టెలో పడిన మగ్‌ను బయటకు తీసేందుకు ప్రయత్నించి ప్రమాదవశాత్తు తలకిందులుగా తొట్టెలో పడిపోయింది. చాలాసేపటి వరకు ఎవరూ ఈ విషయాన్ని గమనించలేదు. కొంతసేపటికి సునీత కుమార్తె కనపడకపోవడంతో వెతకగా నీటి తొట్టెలో పడి ఉండటాన్ని గమనించింది. వెంటనే స్థానికుల సాయంతో బాలికను 108 అంబులెన్స్‌లో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించింది. అయితే పరీక్షించిన వైద్యులు బాలిక అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

వరద బాధితులకు విరాళం

రాజంపేట : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ.5లక్షల విరాళాన్ని అన్నమాచార్య యూనివర్సిటీ అధినేత చొప్పా గంగిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద బాధితులను తమ వంతుగా ఆదుకునేందుకు ఆర్థికసాయాన్ని అందచేస్తున్నామన్నారు.

ప్రశాంత నిమజ్జన ప్రక్రియకు కృషి చేద్దాం

సిద్దవటం : గణనాథుని విగ్రహాల నిమజ్జన ప్రక్రియను ప్రశాంతంగా జరిపేందుకు అందరం సమష్టిగా కృషి చేద్దామని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిమజ్జనం ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉత్సవ నిర్వాహకులు విగ్రహ ఏర్పాటుకు అన్ని అనుమతులు తీసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు ఉంటాయన్నారు. గత ఏడాది నిమజ్జనానికి 500 వినాయ విగ్రహాలు సిద్దవటం పెన్నానది వద్దకు వచ్చాయని, ఈ సారి విగ్రహాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. నిమజ్జన కార్యక్రమానికి ఎన్ని విగ్రహాలు వచ్చిన విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. బద్వేల్, అట్లూరు నుంచి వచ్చే వినాయక విగ్రహాలు సూచించబడిన పాయింట్‌లో నిమజ్జన జరపాలని, మాధవరం, ఒంటిమిట్ట నందలూరు, కడప ప్రాంతాల నుంచి వచ్చే విగ్రహాలను నిర్దేశిత ప్రదేశాల్లో నిమజ్జనం చేయాలన్నారు. పిల్లలను ఎవరూ తీసుకురావద్దని తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మురాషావలి, ఎంపీడీఓ జవహర్‌బాబు, ఎస్‌ఐ చిరంజీవి, మరి కొన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

రాయచోటి టౌన్ : ప్రశాంత వాతావరణంలో వినయ చవితి పండుగను జరుపుకోవాలని అర్బన్ సీఐ చంద్రశేఖర్ పీస్ కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం రాత్రి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వినాయక చవితి పండుగ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని చెప్పారు. అనంతరం నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఊరేగింపు విషయంలో పోలీసుల సూచనలు తప్పనిసరిగా అనుసరించాలని తెలియజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి, అన్ని మతాలకు చెందిన మత పెద్దలు పాల్గొన్నారు.

పోలీసులకు సహకరించండి

లక్కిరెడ్డిపల్లి : ఉత్సవ నిర్వాహకులు పోలీసులకు సహకరించి చవితి ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ వెంకట కొండారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో మతపెద్దలతో కలిసి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లు ఉపయోగించాలన్నారు. చర్చీలు, మసీదుల వద్ద వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయరాదన్నారు. నిమజ్జనం రోజు ట్రాక్టర్ డ్రైవర్లు లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలని, అలాగే మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. బాణసంచా పేల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రవీంద్రబాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు


రాజంపేట రూరల్: టీచర్లను సన్మానించిన ఆకేపాటి


సంబేపల్లె: టీచర్‌ను సన్మానిస్తున్న విద్యార్థులు

రాజంపేట రూరల్ : మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ చొరగుడి విశ్వనాథశర్మకు శిష్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విశ్వనాథ శర్మకు పూజలు చేశారు. అనంతరం ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆకేపాటి అమరనాథరెడ్డి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించి సత్కరించారు.

రామాపురం : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సంబేపల్లె : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువారం ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులను పూలమాలలో, దుశ్శాలువాలతో సత్కరించారు.

పుల్లంపేట : మండల వ్యాప్తంగా గురువారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కొత్తపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సిద్దవటం : సర్వేపల్లి రాధాకృష్ణన్ అడుగుజాడల్లోనే ప్రతి ఉపాధ్యాయుడు నడవాలని ఉపాధ్యాయుడు సమీర్‌బాషా పిలుపునిచ్చారు. మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం టీచర్స్ డే వేడుకలు జరిగాయి.

చిట్వేలి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, చిట్వేలి శాఖ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక విద్యావనరుల కార్యాలయ ప్రాంగణంలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పెనగలూరు : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నందలూరు : మండలంలోని నల్లతిమ్మయ్యగారిపల్లి, నందలూరు, నాగిరెడ్డిపల్లి, పాటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. అక్షర స్కూల్‌లో చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

రాయచోటి (జగదాంబసెంటర్) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 2 ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ప్రిన్సిపల్ డాక్టర్ పి.హర్షలతా పంకజ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అలానే శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు.

లక్కిరెడ్డిపల్లి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువారం లక్కిరెడ్డిపల్లి ఎంఆర్‌సీ భవనంలో టీచర్స్ డేను మానవత సంస్థ ఘనంగా నిర్వహించింది. ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ ఉత్తమ ఉపాధ్యాయులైన 25 మందిని ఎంఈఓ ఆధ్వర్యంలో సన్మానించారు.

చిన్నమండెం : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో గురువారం గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని ఘరానా మోసం

మదనపల్లె : సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని, శిక్షణ తోపాటు లక్షల్లో జీతాలు ఇస్తామని నమ్మబలికి, బాధితుల వద్ద నుంచి రూ. 36.59 లక్షలు వసూలు చేసుకుని మోసం చేసిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. గురువారం తాలూకా సర్కిల్ కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గం చిట్వేలి మండలం తిమ్మయ్యగారి పల్లె పంచాయతీ చిల్లవాండ్లపల్లికి చెందిన వెంకటసుబ్బయ్య కుమారుడు మురళీకృష్ణ (35) ఎంసీఏ పూర్తి చేశాడు. ఇతనికి భార్య స్వప్న కుమారుడు రియాన్ ఉన్నారు. చదువు పూర్తయిన తర్వాత స్టార్టప్ కంపెనీ పెట్టి డబ్బు సంపాదించాలనుకున్నాడు. హైదరాబాదులోని ప్రగతి నగర్‌లో ప్లాట్ నెంబర్ 403లో హవిక్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ ను తాను కంపెనీ డైరెక్టర్‌గా ప్రారంభించాడు. చిట్వేలి మండలం నక్కలపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన వెంకటేష్ కుమారుడు కే రమణ (29) బీకాం కంప్యూటర్ చదివి, ఉద్యోగం మానేసి ఇంటి వద్ద ఉండడంతో అతనిని తన కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్‌గా నియమించుకున్నాడు. ఇతను హైదరాబాదులోని అదే ప్రాంతంలో ప్లాట్ నెంబర్ 503 లో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించేవాడు. మొదట కొద్ది రోజులపాటు కంపెనీ బాగానే నడిచింది. తర్వాత కంపెనీకి కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో నష్టాలు మొదలయ్యాయి. దీంతో కంపెనీ నష్టాలను పూడ్చుకోవడానికి మదనపల్లె ఈశ్వరమ్మ కాలనీకి చెందిన భరద్వాజ్‌ను సంప్రదించి తనకు తెలిసిన వారిని సిఫారసు చేయాల్సిందిగా కోరారు. అభ్యర్థులు ముందుగా ఒక్కొక్కరు 2.5 లక్షల రూపాయలు చెల్లించాలని చెప్పారు. వారి మాటలు నమ్మిన భరద్వాజ్ వివిధ ప్రాంతాలకు చెందిన 15 మందితో రూ.36.59 లక్షలు చెల్లించాడు. 15 మందిని శిక్షణకు పిలిచారు. ఆ కాలంలో జీతం ఇవ్వకపోగా, శిక్షణ పూర్తి అయిన తర్వాత ఉద్యోగ నియామకాలు చేయలేదు. దీంతో బాధితులంతా తాము డబ్బులు ఇచ్చిన భరద్వాజ్ పై ఒత్తిడి తెచ్చారు. దీంతో భరద్వాజ్ తాలూకా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితులను గురువారం మదనపల్లె– తిరుపతి రోడ్డులోని వినాయక దేవాలయం వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు హాజరు పరిచామన్నారు.

విద్యార్థుల ఆందోళన

వీరబల్లి : తమ కళాశాలను అన్యాక్రాంతం కాకుండా చూడాలంటూ వీరబల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను 2001లో ప్రారంభించారు. ఈ కళాశాలకు ఏర్పాటుకు 12 మంది దాతలు ముందుకు వచ్చి 11.20 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి విక్రయించారు. 2002లో కళాశాలకు ప్రహరీని నిర్మించారు. ప్రస్తుతం గత రెండు రోజుల నుంచి రెవెన్యూ సిబ్బంది సహాయంతో స్థానిక తహసీల్దార్ శ్రావణి ఆదేశాల మేరకు స్థలం దాతలైనటువంటి వారి వారసులు కొందరు కళాశాలకు ఇచ్చిన స్థలంలో మాకు హక్కు ఉందని కొలతలు వేయడంతో విషయం తెలుసుకున్న కళాశాల సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థి సంఘం నాయకుడు సుంకు రవీంద్ర గురువారం కళాశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలంటూ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కళాశాలకు సంబంధించిన స్థలం ఎట్టి పరిస్థితుల్లో అన్యాక్రాంతం కాదని విద్యార్థులకు తహసీల్దార్ తెలియజేశారు.